www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -121 శనివారం15 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా



**జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

- నేడు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- గడిచిన పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక విజయమన్న రాష్ట్రపతి

2లో.

# విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన

- చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు
- నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది



**పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్**



**హైదరాబాద్,/ఆగస్టు 14(ప్రజావినికిడి):** :చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల్ **మిగతా 2లో...**

## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

- నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, /ఆగస్టు 14(ప్రజావినికిడి):** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి **మిగతా 2లో...**



## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

- మూడు దశల ఆధునీకరణ ప్రణాళికలో భాగంగా రెండో విడతలో ఈ వాహనాల కొనుగోలు
- ప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

**అమరావతి, /ఆగస్టు 14 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాజధాని అమరావతిలోని సీడ్ **మిగతా 2లో...**

## అరుదైన గౌరవం

**పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు**



# గ్లోబల్ సమ్మిట్ 2.0

**తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం**

- డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా



**హైదరాబాద్,ఆ/ఆగస్టు 14 (ప్రజావినికిడి):** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు **మిగతా 2లో...**

## సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

- రాహుల్ గాంధీకి భారీ ఊరట..
- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు



2లో.



## నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలన్న నిమ్మల
- ఏపీ అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడి
- నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు వ్యవహరించాలన్న నిమ్మల

**అమరావతి, /ఆగస్టు 14 (ప్రజావినికిడి):** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం నీటిని వినియోగించుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి**మిగతా 2లో...**

# పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా

## జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ,/ఆగస్టు 14 (ప్రజావినికిడి):**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు**
ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా



తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దేశం ముందంజ**
గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు.

**యువశక్తికి, మహిళా సాధికారతకు పెద్దపీట**
ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి పారదర్శకతను పాటిస్తామని ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. దేశ జనాభాలో 65 శాతం ఉన్న 35 ఏళ్లలోపు యువతే స్టార్టప్ వ్యవస్థకు చోదక శక్తిగా నిలుస్తోందని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు వారే సారథులని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలపడుతున్నాయని అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

**అంతర్గత భద్రత, సామాజిక పురోగతి**
దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్రపతి అభివర్ణించారు. ఒకప్పుడు మావోయిజంప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధి జరుగుతోందని, ఇటీవల బస్తర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ఇందుకు నిదర్శనమని చెప్పారు. 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా దేశంలో క్రీడా పర్యావరణ వ్యవస్థ బలోపేతమై, అంతర్జాతీయ పోటీలలో మన క్రీడాకారుల ప్రదర్శన గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రజా భాగస్వామ్యం (జన్ భాగీదారీ) అనేది మన దేశ సంప్రదాయమని, పౌరుల భాగస్వామ్యంతోనే జాతీయ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దేశ విభజన నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటూ, 500కు పైగా సంస్థానాలను ఏకం చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కిచెప్పారు. ప్రసంగం ప్రారంభానికి ముందు, పార్శీ నూతన సంవత్సరం 'నవ్రోజ్' సందర్భంగా దేశ విదేశాల్లోని పార్శీ సోదర సోదరీమణులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

**న్యూఢిల్లీ,/ఆగస్టు 14(ప్రజావినికిడి):**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు.
శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.
అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

**మొదటిపేజీ తరువాయి**
సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (÷ూఅ఻ం) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు.
'ఇదంతా పూర్తిగా అనవసరమైన పక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷–లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

## రాహుల్ గాంధీకి భారీ ఊరట..

**/ఆగస్టు 14 (ప్రజావినికిడి):**
సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది.
జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది.
2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

# నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

**మొదటిపేజీ తరువాయి**
గోదావరి నదీ యాజమాన్య బోర్డు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) సమావేశాలు ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి ఉన్న అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎమ్‌బీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. జీఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు పరస్పరం వ్యవహరించాలని సూచించారు.
ఇదే క్రమంలో గోదావరి – కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై కూడా ఆయన మాట్లాడారు. ఈ అనుసంధానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు.

# అరుదైన గౌరవం

## పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు

**హైదరాబాద్,/ఆగస్టు 14 (ప్రజావినికిడి)::** :తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.
ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి.
ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.
------------------

# విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన

**మొదటిపేజీ తరువాయి**
విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా ఫూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా ఫూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా ఫూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు.

# 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

**మొదటిపేజీ తరువాయి**
యాక్సెస్ రోడ్డులో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సమర్థవంతంగా స్పందించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టారు.
కొత్తగా సమకూర్చిన ఈ వాహనాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు. అగ్నిమాపక శాఖను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం మొత్తం మూడు దశల్లో రూ.252.86 కోట్లతో ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఇప్పటికే రూ.33 కోట్లతో 65 వాహనాలను అందుబాటులోకి తీసుకురాగా, తాజా ప్రారంభోత్సవం రెండో దశకు చెందింది. మూడో దశలో మరిన్ని వాహనాలతో పాటు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. వాహనాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త ఫైర్ స్టేషన్ల నిర్మాణం, 36 పాత స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి.
ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాహనాల పనితీరు, ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదాలకు త్వరితగతిన స్పందించి, ప్రాణ, ఆస్తినష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టినట్లు వారు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

**మొదటిపేజీ తరువాయి**
స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శనివారం15 ఆగస్టు 2026

# హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో,సివిల్ సప్లియస్ , ఎస్‌డబ్ల్యుసి, సిడబ్ల్యుసి, గిరిజన కార్పొరేషన్,రైల్వే గూడ్ షెడ్,ఆర్టీసీ పోర్టర్స్,ఫ్రూట్ మార్కెట్, రైస్‌మిల్స్, ట్రాన్స్‌పోర్ట్, లిక్కర్ గోడౌన్‌లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. నేడు ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం, హిమాయత్‌నగర్‌లో జరిగిన వివిధ హమాలీ రంగంలో పనిచేస్తున్న కార్మికుల తెలంగాణ రాష్ట్ర హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగంలో లక్షలాది మంది హమాలీలు పనిచేస్తూ శ్రమదోపిడీ గురవుతున్నారన్నారు. హమాలీ కార్మికులకు ఏ చట్టాలు అమలుకాక చివరకు ప్రమాదాలు జరిగి ప్రాణం కోల్పోయినా నష్టపరిహారం ఇచ్చే నాథుడే కరువయ్యాడని వాపోయారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు ఇతర అన్ని సంస్థలు ప్రభుత్వ యాజమాన్య సంస్థలే అయినప్పటికీ ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ చర్యలను తీసుకోకుండా హమాలీ కార్మికులను నిర్దాక్షిణంగా అనిచివేస్తున్నారని తెలిపారు. ఎఐటియుసి హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలకు మారగోని ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, సివిల్ సప్లయ్‌లో రేషన్ డీలర్లను అదే విధంగా రేషనింగ్ వ్యవస్థ పంపిణీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికుల పనికి తీవ్ర నష్టం కలిగించే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చి ఎనీ టైం రైస్ (ఎటిఆర్) రేషన్ కార్డు వినియోగదారులకు పంపిణీ చేస్తుందని చెప్పారు. అనేక పోరాటాల అనంతరం 50కిలోల బస్తాను అమలు చేసుకోవటం జరిగిందని, హమాలీ కార్మికులకు కొన్ని సంస్థలలో యూనిఫాం, ఇతరాత్ర సౌకర్యాలు కల్పిస్తున్నా మెజార్టీ సంస్థలలో హమాలీలను పశు వులకంటే హీనంగా చూస్తున్నారన్నారు.అనేక పోరాటాలు చేసి సాధించిన 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు బడా పారిశ్రామిక వేత్తలకు మేలు చేసేందుకు ప్రావిడెంట్ ఫండ్, ఇయసఐ, గ్రాట్యుటీ,బోనస్ చట్టాలను అమలు చేయటం లేదన్నారు. భవిష్యత్తులో 3 నెలల రేషన్ ఒకేసారి ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని హెచ్చరించారు. నేడు జరిగిన తెలంగాణ రాష్ట్ర హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవటం జరిగింది. గౌరవాధ్యక్షులుగా జి.మునీశ్వర్, అధ్యక్షులుగా వై.ఓమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి యం.ప్రవీణ్ కుమార్ ను ఎన్నుకున్నారు.

# మొదటి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన బాటా ఇండియా

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** భారతదేశపు అత్యంత విశ్వసనీయమైన పాదరక్షల సంస్థ బాటా ఇండియా, జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికానికి తన ఆర్థిక ఫలితాలు నేడు ప్రకటించింది. ఎఫ్వై 26 మొదటి త్రైమాసికంతో పోలిస్తే సుమారు 4 శాతం వార్షిక వృద్ధితో రూ. 9,789 మిలియన్ల ఆదాయాన్ని ఆర్జించింది.ఈ త్రైమాసికానికి పన్ను అనంతర లాభం రూ.637 మిలియన్లుగా ఉంది,గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది రూ.517 మిలియన్లుగా ఉండగా,23 శాతం పైగా వృద్ధిని నమోదు చేసిందనీ పేర్కొంది.ఒకేసారి వచ్చే ఖర్చులు మినహాయించి, పన్నులకు ముందు లాభం ఈ త్రైమాసికంలో రూ. 906 మిలియన్లుగా ఉంది.గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది రూ.745 మిలియన్లుగా ఉండగా,22 శాతం పైగా వృద్ధిని సాధించిందనీ వెల్లడించింది.ఈ త్రైమాసికంలోని ఒకేసారి వచ్చే ఖర్చులలో లైసెన్స్ ఫీజులపై రూ. 100 కోట్ల నాన్-క్యాష్ ఫారెక్స్ నష్టం కూడా ఉందనీ, నిరంతర కరెన్సీ విలువ క్షీణత, ఒకేసారి అయిన ఈఆర్పి అమలు ఖర్చు రూ. 24 మిలియన్ల కారణంగా రూ. 27 మిలియన్లు తగ్గిందనీ పేర్కొంది.

# 10 వేల మందికి ఉద్యోగాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వంతో సేల్స్‌ఫోర్స్ భాగస్వామ్యం




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** ప్రపంచంలోనే 1 ఏజెంటిక్ సిఆర్ఎం సంస్థ అయిన సేల్స్‌ఫోర్స్, త్రిపుర ప్రభుత్వ సమాచార సాంకేతిక శాఖతో కలిసి, రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ నైపుణ్యాల అవకాశాలను విస్తరించడానికి ఉద్యోగాలకు సిద్ధమయ్యే సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి నేడు ఒక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. అగర్తలలో జరిగిన డెస్టినేషన్ త్రిపుర బిజినెస్ కాన్‌క్లేవ్ 2026 సదస్సులో ప్రకటించిన ఈ కార్యక్రమం ద్వారా, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు పారిశ్రామికవేత్తలను కృత్రిమ మేధస్సు ఆధారిత ఆర్థిక వ్యవస్థకు సన్నద్ధం చేస్తూ, త్రిపురను డిజిటల్‌గా అభివృద్ధి చేసే ప్రభుత్వ లక్ష్యానికి మరింత బలం చేకూరుస్తుందనీ పేర్కొంది. సేల్స్‌ఫోర్స్‌కు చెందిన ట్రైల్‌హెడ్ ఆన్‌లైన్ లెర్నింగ్ వేదిక ద్వారా 2027 నాటికి 10,000 మందికి పైగా అభ్యాసకులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారనీ, ప్రస్తుతం ఏఐ ఆధునిక సాంకేతికతలు మన ఉద్యోగాలను మారుస్తున్న తరుణంలో, భవిష్యత్తుకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను ఇది అందిస్తుందనీ తెలిపింది. ప్రారంభ,మధ్యస్థ స్థాయి అభ్యాసకుల కోసం రూపొందించిన ఈ వేదికలో సిఆర్ఎం బిజినెస్ అనాలిసిస్ టెక్నాలజీ ప్రాథమిక అంశాలను నేర్చుకోవచ్చునీ ప్రకటించింది.

# గిరిజన చట్టాల అమలు పై సిఎం,సమాధానం చెప్పాలి

**ములుగు జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి,3 జీవో,1/70 చట్టాల పై స్పష్టత ఇవ్వాలి.జీఎస్ పిములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్**

**ఆదివాసీ ప్రజాప్రతినిధులు వానకాలం అసెంబ్లీ సమావేశంలో నోరు విప్పాలి..**



**వాజేడు,ఆగష్టు 15,(ప్రజావినికిడి):** జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని, ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని,గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంత చట్టాలను కాపాడడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం విఫలం అవుతుందని,ఆదివాసి చట్టాలను హక్కులను కాలరాసే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 3జీవో ని పునరుద్ధరించడానికి,రాజ్యాంగ నిపుణులతో చర్చించి ప్రత్యేక చట్టం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని పూనెం ప్రతాప్ గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూ రక్షణ చట్టం రక్షించాల్సిన బాధ్యత ఆదివాసి ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన అన్నారు,

ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల మైదాన ప్రాంతాల నుంచి నాన్-ట్రైబల్స్ భారీగా వలసలు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక్కడి భూముల అమ్మకాలకు, కొనుగోలుకు తమకు కూడా అవకాశం కల్పించాలని, 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నాన్-ట్రైబల్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే మేల్కొనకపోతే ఆదివాసుల అస్తిత్వానికి, మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. జీవో 3 ప్రత్యామ్నాయ చట్టం,1/70 చట్టాల పరిరక్షణకు గొండ్వానా సంక్షేమ పరిషత్ దశల వారి ఉద్యమలు కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు.

గతంలో జీవో నెంబర్ 3 విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఆదివాసులకు ఎటువంటి చేదు అనుభవాన్ని మిగిల్చిందో, భూ చట్టం విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటే అదే పరిస్థితి పునరావృతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వానాకాలం అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ ప్రజాప్రతినిధులు నోరు విప్పాలి. లేకుంటే జాతి ద్రోహులే అవుతారని హెతువు చేశారు.

ఆదివాసుల ఉనికి,సంస్కృతి నిలబడాలంటే భూ రక్షణ చట్టాల అమలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ప్రజాప్రతినిధులు తమ స్వార్థాన్ని పక్కనపెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, జీవో 3 ప్రత్యామ్నాయ చట్టం 1/70 పరిరక్షణకు ప్రభుత్వం ముందడుగు వేసేలా చేయాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో, చరిత్రలో ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ప్రజాప్రతినిధులు 'జాతి ద్రోహులుగా మిగిలిపోతారని పూనెం ప్రతాప్ అన్నారు.16న ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 1/70,3 జీవో చట్టాల పై పూర్తి స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు.

# గల్ఫ్ దేశాల్లో మహిళా కార్మికుల భద్రత కోసం వన్-స్టాప్ సెంటర్లు ఏర్పాటు

**- విదేశాంగ మంత్రిత్వ శాఖ**



**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయ మహిళా కార్మికులకు సురక్షితమైన, సులభమైన, మరింత అందుబాటులో ఉండే పని వాతావరణాన్ని కల్పించేందుకు భారత ప్రభుత్వం కీలకమైన దౌత్య, మానవతా చర్యలు చేపట్టింది. క్లిష్టమైన లేదా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే భారతీయ మహిళలకు తక్షణ, సమన్వయ సహాయాన్ని అందించేందుకు గల్ఫ్ ప్రాంతంలోని ప్రధాన నగరాల్లో ఏడు అత్యాధునిక 'వన్-స్టాప్ సెంటర్లు' ఏర్పాటు చేశారు.విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలను వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయులు ఎదుర్కొంటున్న సవాళ్లు,ఈ సమస్యల పరిష్కారానికి భారత్ తీసుకుంటున్న చర్యలపై రాజ్యసభ ఎంపీ రాజీవ్ సింగ్ సమాచారం కోరారు.తన సమాధానంలో సహాయ మంత్రి తెలిపిన వివరాల ప్రకారం,గల్ఫ్ దేశాల్లో దాదాపు 1 కోటి మంది భారతీయ పౌరులు నివసిస్తున్నారు. వీరిలో యూఏఈలో 45 లక్షలు,సౌదీ అరేబియాలో 27 లక్షలు,కువైట్‌లో 10 లక్షలు, ఖతార్‌లో 8.2 లక్షలు,ఒమన్‌లో 6.7 లక్షలు, బహ్రెయిన్‌లో 3.1 లక్షలు మంది ఉన్నారు. 2014 నుంచి జూన్ 2026 వరకు, 'ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్ కేటగిరీ పాస్‌పోర్టులు కలిగిన మొత్తం 50,25,506 మంది వలస కార్మికులకు,ఆరు గల్ఫ్ దేశాల్లో విదేశీ ఉపాధి కోసం'ఎమిగ్రేషన్ క్లియరెన్స్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో బిఎల్ఏలు, సీనియర్ నాయకులకు ఘన సన్మానం..





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే,తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు బహదూర్‌పల్లి పరిధిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎస్ఐఆర్-2026 కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దుండిగల్, బౌరంపేట్, బహదూర్‌పల్లి డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఏలు, సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. అనంతరం వారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఏ.పీ.మిథున్ రెడ్డి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,మాజీ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి,స్టేట్ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి , డిసిసి కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్-2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన బిఎల్‌ఏలు, సీనియర్ నాయకులు అదేవిదంగా డివిజన్ అధ్యక్షులను ఘనంగాసన్మానించివారిసేవలను అభినందించారు.నాయకులు మాట్లాడుతూ, ఎస్ఐ ఆర్-2026 కార్యక్రమంలో బూత్ స్థాయిలో బిఎల్ ఏలు, నాయకులు మరియు కార్యకర్తలు చేసిన కృషి నిబద్ధత అభినందనీయమని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, అర్హులైన ఓటర్లకు వారికి సంబంధించిన ప్రక్రియలో భాగంగా నిబద్ధతతో బాధ్యతాయుతంగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా శుభాభినందనలు తెలియజేశారు. అదేవిధంగా రానున్న రోజుల్లో కూడా ఇదే నిబద్ధత, సమన్వయం మరియు అంకితభావంతో పనిచేస్తూ, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు, బిఎల్‌ఏలు, డివిజన్ నాయకులు సీనియర్ నాయకుల సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు.

# హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగిరించాలి

**బీజేపీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతిబాబు పిలుపు**





**వాజేడు,ఆగష్టు 15,(ప్రజావినికిడి):** భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకోని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన "హర్ ఘర్ తిరంగా" ప్రతి ఇంటిపై జాతీయ జెండా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలని వాజేడు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది జగపతిబాబు, పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహానీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ భారతీయుడి ప్రాథమిక బాధ్యత అని అన్నారు."హర్ ఘర్ తిరంగా" అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, దేశ ప్రజలందరినీ ఐకమత్యంగా ఉంచే దేశభక్తి ఉద్యమమని పేర్కొన్నారు. వాజేడు మండల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటా జాతీయ జెండాను సగర్వంగా ఎగరవేయాలి.ఈ వేడుకల్లో యువత, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలి.ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగరవేసి,దానికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ భావితరాలకు ప్రేరణగా నిలవాలి.అని ఈ కార్యక్రమంలో పాల్గొని దేశభక్తిని చాటుకోవాలని మండల ప్రజలను, బిజేపి నాయకులను, కార్యకర్తలను జగపతిబాబు కోరారు.

# ట్రాఫిక్ సమస్యల నుండి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్..

**బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్ధిరాములు..**




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ట్రాఫిక్ సమస్యతో నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నియోజకవర్గ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఎమ్మెల్యే వివేకానంద్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించి ట్రాఫిక్ నియంత్రించే దిశగా చర్యలు చేపట్టి బోయినపల్లి నుండి కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు సుమారు 15 కిలోమీటర్ మేర రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. సుమారు 700 కోట్లు నిధులను రోడ్డు విస్తరణ పనులను మంజూరు చేయించి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు శరవేగముగా పనులు జరిగాయని.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పై ఓవర్ ప్రాజెక్ట్ పనులు పూర్తిగా నిలిపివేసారణి బోయినపల్లి నుండి కొంపల్లి మేడ్చల్ వరకు సుమార్ 750 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులు నిలిచి పోవడం తో నిత్యం స్కూల్ బస్సులు కాలేజ్ బసులు ఐటీ ఉద్యోగులు నిరంతర రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ నిలిచిపోయిన పనుల వల్ల రాకపోకలు నిర్వహిస్తున్న ప్రజలకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని..ఆ రహదారిలో ప్రయాణించే కొందరి విద్యార్థులకు ప్రాణాలు కూడా కోల్పోయారని తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై పట్టింపు లేదని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఈ ప్రాంత ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని తెలియజేస్తు రానున్న రోజులలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తామనీ వెంటనే ప్రభుత్వాలు సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చూపాలని అన్నారు.శ్రీ లక్ష్మి ఇన్ఫ్రా కంపెనీ పైన క్రిమినల్ కేసులు పెట్టాలని కొత్త కాంట్రాక్టర్లను నియమించాలని, బ్రిడ్జ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా క్వాలిటీ లేని అరకొర పనులతో అసంపూర్తిగా పనులను నిలిపివేశారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ట్రాఫిక్ సమస్యల నుండి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు డిమాండ్ చేశారు.


भारतीय राष्ट्रीय राजमार्ग प्राधिकरण
(सड़क परिवहन और राजमार्ग मंत्रालय, भारत सरकार)
NATIONAL HIGHWAYS AUTHORITY OF INDIA
(Ministry of Road Transport & Highways, Government of India)
PROJECT IMPLEMENTATION UNIT : KAMAREDDY
H.No.3-78/4, SECOND FLOOR, NEAR ESSAR PETROL PUMP, OLD NH-7 ROAD, KAMAREDDY DISTRICT-503110, TELANGANA
Phone No : 08468 293488, E-mail: piukamareddy@nhai.org

NHAI/PIU-KMR/NH-44/2026/ 187/A — Dt: 25.02.2026

To
United Voters Social Foundation
1-154/2/5, opp. Cine Planet, Kompally, Hyderabad,

Sub: NHAI, PIU, KAMAREDDY - Public Grievance received from United Voters Social Foundation, Kompally - Reply - Reg.

Ref: Grievance of United Voters Social Foundation, Kompally vide reg. No. PMOPG/E/2026/0028923, dt. 19/02/2026.

Sir,

This has reference to the subject matter, wherein application received through Public Grievance Portal from United Voters Social Foundation, Kompally regarding urgent intervention required for delayed Six-laning of NH-44 (Suchitra to Kompally) and unchecked safety Hazards Caused by Construction Traffic.

2. In this regard, it is informed that the works was halted for some time due to cash flow issues of the contractor. However, the issue has now been resolved , the construction works have been resumed. The remaining works are excepted to be completed by the end of this year.

This is for favor of information.

Yours faithfully
25/2/26
(P. NAGESWARA RAO)
GM (Tech) &Project Director
NHAI, PIU, KAMAREDDY

Copy to: The CGM (Tech) & Regional Officer, NHAI, RO, Hyderabad - for favour of information.

कारपोरेट कार्यालय : जी-5 एवं 6, सेक्टर-10, द्वारका, नई दिल्ली - 110075. वेबसाइट : www.nhai.gov.in
Corporate Office: G-5 & 6, Sector - 10, Dwarka, New Delhi - 110075. Website : www.nhai.gov.in

# చింతూరు,పాఠశాలకు కాంపౌండ్ నిర్మించిన దాతలు

## సొంత ఖర్చులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ఆర్కేఆర్, బ్రదర్స్





**వాజేడు,ఆగష్టు 15,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం చింతూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థుల రక్షణార్థం సిమెంట్ పోల్స్, జాలీ (ఫెన్సింగ్) నిర్మాణాన్ని చేపట్టారు.పాఠశాలకు ప్రాంగణ గోడ (కాంపౌండ్ వాల్) లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన 'ఆర్ కే ఆర్, బ్రదర్స్' తమ సొంత గ్రామం పై ఉన్న అభిమానంతో, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందుకు వచ్చారు.వారు తమ సొంత నిధులతో సిమెంట్ పోల్స్ నాటి,చుట్టూ నాణ్యమైన ఫినిషింగ్ జాలీని ఏర్పాటు చేయించారు.పాఠశాలకు రక్షణగా నిలిచిన 'ఆర్ కే ఆర్ బ్రదర్స్' సేవా నిరతిపై గ్రామస్థులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.సొంత ఊరి పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సాయం అందించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొని 'ఆర్కేఆర్, బ్రదర్స్'కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తిరంగా ర్యాలీ తో ఘట్కేసర్ లో దేశభక్తి పెంపొందించిన ఘట్కేసర్ విద్యాకిరణ్ హైస్కూల్ విద్యార్థులు



**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
ప్రజల్లో దేశభక్తి, జాతీయ జెండాపై గౌరవాన్ని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా హర్ దిల్ తిరంగా అనే నినాదంతో ఘట్కేసర్ విద్యాకిరణ్ హై స్కూల్ ఎన్ సి సి విద్యార్థులు భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ శివారెడ్డిగూడ లోని విద్యాకిరణ్ హై స్కూల్ కు చెందిన ఎన్ సి సి విద్యార్థులు హర్ ఘర్ తిరంగా పేరుతొ భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఘట్కేసర్ శివారెడ్డిగూడ లోని విద్యాకిరణ్ హై స్కూల్ ప్రాంగణం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు వంద మంది
ఎన్ సిసి విద్యార్థులతో కూడిన సైకిల్ ర్యాలీని స్కూల్ కరస్పాండెంట్ రమేష్,డైరెక్టర్ పుష్పలత, ప్రిన్సిపాల్ సత్యనారాయణ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తమ విద్యాకిరణ్ స్కూల్ ఎన్ సి సి 2(౧) బెటాలియన్ క్యాడెట్లతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం ఆనందంగా ఉండని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అసోసియేట్ ఎన్ సిసి ఆఫీసర్ ఎన్.దుర్గా ప్రసాద్,పాఠశాల ఇంచార్జ్ నవీన్ కుమార్ , సిబ్బంది వంశీకృష్ణ, వినోద్, మధు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీఒక్కరూ సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని వినియోగం చేసుకోవాలి.




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుడికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్ లకు చెందిన నాయకులు లబ్దిదారులకు అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ ప్రజల ఆరోగ్య రక్షణకై నిరంతరం పనిచేసే నాయకులు బిఆర్ఎస్ ఎల్పి విప్, కేపీ.వివేకానంద్ అని,అర్హులైన ప్రతీ ఒక్కరూ ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎల్వోసీ దరఖాస్తు దారుల వివరాలు :-130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం సుందర్ నగర్ కు చెందిన టీ.కవిత భర్త టీ.శివ శంకర్ అనే దరఖాస్తుదారురాలికి రూ.1,50,000/- (ఒక లక్ష యాభై దెబ్భై ఐదు వేల రూపాయలు) మంజూరు..
131 – కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రసూన నగర్ కాలనీకి చెందిన లబ్ధిదారుడు రూ. 1,10,000/- (ఒక లక్ష పది వేల రూపాయలు) మంజూరు..సీఎంసీ దుండిగల్ సర్కిల్ చర్చ్ గాగిల్లాపూర్ కు చెందిన గాలి జీవన శిల్ప తండ్రి గాలి రాజారెడ్డి కు చెందిన లబ్ధిదారురాలు రూ. 1,35,000/-(ఒక లక్ష ముప్పై ఐదు వేలు) మంజూరు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్,డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు కిషోర్ చారి, బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, రమణా రెడ్డి, బొంబాయి శ్రీను, ఆంజనేయులు, మధుకర్ రెడ్డి, డీజే రమేష్, జయం చారి, శివా గౌడ్,దిలీప్, నర్సింహా రెడ్డి, ప్రభాకర్,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళల గౌరవం.. సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

## హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీత శశిధర్ రెడ్డి..



**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**
మహిళల గౌరవం సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీత శశిధర్రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ లో ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మహిళలకు చీరలను అందజేసిన హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీత శశిధర్ రెడ్డి,మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం మరియు సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వం నాసిరకమైన చీరలు ఇచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది, కానీ ప్రజాప్రభుత్వం మహిళల ఆత్మగౌరావానికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన చీరలను అందిస్తుంది తెలిపారు మహిళలకు అండగా నిలవడం,వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం,ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపడం కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు టి. బుచ్చి రెడ్డి, సెక్రటరీ టి. వెంకట్రాంరెడ్డి,కోశాధికారి కె.చిన్న రెడ్డి,బ్రహ్మ రెడ్డి, చంద్ర శేఖర్,మణిపాల్ రెడ్డి,మారుతీ, స్వాతి,రెప పద్మ, రాధిక,లావణ్య, నిర్మలమ్మ, మేరీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేస్తున్న బీజేపీని గద్దెదించుదాం

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్..




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నేడు సిపిఐ ప్రచార యాత్ర లో భాగంగా షాపూర్ నగర్ బస్ స్టాప్ వద్ద ముగింపు సభ సిపిఐ కుత్బుల్లాపూర్ సమితి తరపున నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసఫ్ పాల్గొని బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బ్రిటిష్ పాలనలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దుచేసి కార్పొరేట్ పెట్టుబడిదారీ యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా కార్మిక నూతన లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని దీనివల్ల కార్మికులు సమ్మెహక్కును ఉద్యోగ భద్రతను కనీస వేతనాల హక్కులను ప్రమాదవశాత్తు బీమా పొందే హక్కును సంఘాలను స్థాపించిన హక్కులను కోల్పోయిందని పైకి మంచిగా కనిపించినప్పటికీ లోపలి సారమంతా యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా బిజెపి నరేంద్ర మోడీ చేసి వ్యాపారస్తులకు తమ భక్తిని చాటాయని విమర్శించారు. అంతేకాకుండా నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తానని హామీ ఇచ్చి ధరలను తగ్గించకుండా ధరలను విపరీతంగా పెంచి ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు నెట్టిన బిజెపి నరేంద్ర మోడీ శ్రీరాముడి పేరుతో హిందూ పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారని కానీ అయోధ్య రామాలయంలో జరిగిన దొంగతనాన్నీ చూసి ప్రజలు బిజెపి మోడీ యొక్క అసలు రూపాన్ని తెలుసుకున్నారని అందుకే నరేంద్ర మోడీ అమిత్యాలు పార్లమెంట్కు రాకుండా ప్రజలకు భయపడి దూరంగా ఉన్నారని ఈ సంఘటనలను చూస్తే రానున్న రోజుల్లో బిజెపిని ప్రజలు ఊడగొట్టడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథి జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పాల్గొని మాట్లాడుతూ, బిజెపి నరేంద్ర మోడీ ఎన్నికల్లో వస్తున్న విజయాలను చూసి గర్వంతో తాము ఏమి చేసినా ప్రజలు తిరగబడరని నియంతృత్వ పోకడలకు పోయి అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయి అంతిమంగా బిజెపికి వ్యతిరేకంగా పోరాడడం ప్రారంభించారని దానికి నిదర్శనమే ఢిల్లీలో జరిగిన విద్యార్థి ఉద్యమం అని అన్నారు విద్యార్థి ఉద్యమంతో దిగివచ్చిన బిజెపి నరేంద్ర మోడీ అయోధ్య రామాలయంలో జరిగిన దొంగతనాన్ని గురించి మాట్లాడట్లేదని ఇదే వారికి రాముని పైన దేవుని పైన హిందుత్వం పైన ఉన్న ప్రేమను చూపిస్తుందని విమర్శించారు. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం విద్యార్థి యువజన కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు దేవుని వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఇదే వారి ఓటమికి నాంది అని ప్రజలు చైతన్యవంతులు అవుతున్నారని వచ్చే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారని దాన్ని సిపిఐ నాయకత్వం మరియు కార్యకర్తలు గ్రహించి తమ ప్రచారాలను మరింతగా పెంచడానికి దేశవ్యాప్తంగా ఈ ప్రచార యాత్రలను ప్రారంభించింది అని అన్నారు.ఈ ప్రచార యాత్రలో దేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు జిల్లాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమానికి ఏ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు,జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి,శాఖ కార్యదర్శి బక్కరి మల్లేష్,సిపిఐ నాయకులు శ్రీనివాస్,మల్లేష, రమేష్, మహేందర్, ప్రసాద్నాయక్, భీమేష్,కనకయ్య, రమేష్,కిష్టయ్య, వీరయ్య,మజ్జి గౌరీ,పవన్ భీమేష్,లతో పటు వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రారంభ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ..









**నాగోల్,(ప్రజావినికిడి):**ప్రజల్లో దేశభక్తి జాతీయ జెండాపై గౌరవాన్ని పెంపొందించాలా హర్ ఘర్ తిరంగా హర్ దిల్ తిరంగా అనే నినాదంతోప్రారంభ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.ఈ తిరంగా ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎంఈఓ రామారావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు 1500 మంది పాల్గొనడం జరిగింది.200 మీటర్ల జాతీయ పతాకం,నాగోల్ నుండి ఆనంద వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో మన్సురాబాద్ తాజా మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేశిరెడ్డి పద్మా రెడ్డి,ప్రధాన కార్యదర్శి సృజనా,ఈ తిరంగా ర్యాలీలో విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో ఘనంగా హరితహారం

## ఈడీ ఖుస్రో షా ఖాన్,ఆర్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అధికారులు సిబ్బంది







**హైదరాబాద్,(ప్రజావినికిడి):** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్,రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో
మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రో షా ఖాన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి చెట్లుగా పెంచినప్పుడే హరితహారం కార్యక్రమానికి నిజమైన సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు.
ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటడం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమని అధికారులు తెలిపారు. బస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంతో పాటు పర్యావరణహిత వాతావరణాన్ని కల్పించేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
రీజినల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థలో కీలకమైన ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బస్‌స్టేషన్లు, డిపోలు, కార్యాలయాల పరిసరాల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం ద్వారా వాటిని సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.
హరితహారం కార్యక్రమాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని అధికారులు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కూడా సంస్థ తరఫున మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.
కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఆర్. సింగ్,డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ విలాస్ రెడ్డి,డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుగుణాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆండాలు,ఈడీ కార్యాలయ కార్యదర్శి శివరామకృష్ణ, సీఆర్ఎం రఘు తదితర అధికారులు, టీ.జీ.ఎస్.ఆర్.టి.సి సిబ్బంది పాల్గొన్నారు.

# శంషాబాద్ పట్టణంలోనీ కాముని చెరువులో గుర్రపు డెక్క నిర్మూలనకు శ్రీకారం..

## పాల్గొన్న: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,ప్రజా ప్రతినిధులు



**శంషాబాద్,(ప్రజావినికిడి):**శంషాబాద్‌లోని కాముని చెరువు'లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను నిర్మూలించి,చెరువును పరిశుభ్రం చేసేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన ఈ చెరువు పరిశుభ్రత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా, ప్రజలందరికీ ఉపయోగపడేలా చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని,గుర్రపు డెక్క నిర్మూలన ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

# అశోక చక్రంలో 24 ఆకులకు ఒక్కో విలువ ఒక్కో అర్థం..

## ఆచరిస్తే అద్భుతాలు.. -జాతీయ జెండాలో అశోక చక్రానికి సమున్నత ప్రాధాన్యం..

## టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
త్రివర్ణ పతాకంలో నిండు సూర్యుడిలా మెరిసే అశోక చక్రం.అందులో 24 ఆకులు అవి చెప్పే అతి పవిత్ర భావాలు. ఆచరిస్తే వ్యక్తిని, దేశాన్ని సమున్నతంగా నిలబెట్టే ఆయుధాలు అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు తెలియజేశారు.రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం పరిధిలోని కాశిరెడ్డి గూడా గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు లింగారం కుమార్ గౌడ్ నివాసంలో అశోక చక్రంలో 24 ఆకుల ప్రాముఖ్యత సమావేశానికి నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా బక్కని మాట్లాడుతూ అశోక చక్రం ఉన్న జాతీయ జెండాను తొలిసారిగా 1947 జులై 22న పతాకావిష్కరణ చేశారాని జాతీయ జెండాలో అశోక చక్రానికి సమున్నత ప్రాధాన్యం అశోకుడి సారనాథ్ స్తంభం ధర్మ చక్రం నుంచి దీన్ని గ్రహించరని అన్నారు.అశోక చక్రంలో 'చక్ర' అనే పదం సంస్కృతం నుంచి వచ్చింది.'స్వయంగా తిరుగుతూ, కాల చక్రంలా తన చలనాన్ని పూర్తి చేసి,మళ్లీ తన గమనాన్ని ప్రారంభించేంది' అని దీని అర్థం. అశోక చక్రంలో ఉండే 24 ఆకులు రోజులో 24 గంటలను వ్యక్తీకరిస్తాయి. ప్రతి ఒక్కరూ రోజులో 24 గంటల పాటు అలసట లేకుండా పని చేయాలని ఇది మనకు ప్రబోధిస్తుంది. అశోక చక్రంలో ఉన్న 24 ఆకులకు తగిన భావాలున్నాయి. ప్రతి వ్యక్తి నిర్వర్తించాల్సిన విధుల గురించి ఇవి చెబుతాయి. అందువల్ల దీన్ని 'విధుల చక్రం'గానూ పేర్కొంటారు.ప్రతి మనిషికి తప్పనిసరిగా ఉండాల్సిన 24 రకాల లక్షణాల గురించి ఇది వివరిస్తుంది.కులాలు, మతాలకు అతీతంగా ఇవి అందరికీ వర్తించే నియమాలివి. ఆ మాటకొస్తే.. ప్రపంచంలో ఎలాంటి సమాజానికైనా, ఏ దేశానికైనా ఇవి పనికొచ్చేవే.జాతి నేతలు సమున్నత లక్ష్యాలతో మన త్రివర్ణ పతాకంలో పొందుపర్చిన ఆ నియమాల ఇవే..

**అశోక చక్రంలోని 24 ఆకులు బోధించే భావాలను వివరించిన బక్కని**

పవిత్రత పవిత్రంగా ఉండటం అతి సాధారణంగా



సద్వర్తనతో జీవితాన్ని గడపడం.. ఆరోగ్యం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా, దృఢంగా ఉండటం. శాంతి శాంతి దేశంలోని ప్రతి పౌరుడితో శాంతి, సామరస్యంతో మెలగడం. త్యాగం త్యాగం (దేశం కోసం, సమాజం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండటం. నైతికత వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో ఉన్నత విలువలతో ఉండటం సేవ సేవా భావం (దేశం కోసం, సమాజం కోసం సేవ చేయడానికి సర్వ సిద్ధంగా ఉండటం..క్షమ క్షమాగుణం మనుషుల పట్ల, జీవుల పట్ల అచంచలమైన క్షమాగుణం కలిగి ఉండటం..ప్రేమ దేశం పట్ల,దేవుడి సృష్టిలోని ప్రతి జీవి పట్ల ప్రేమ కల్గి ఉండటం.. స్నేహం స్నేహభావం పౌరులందరితో సుహృద్భావ సంబంధం కల్గి ఉండటం.. సోదరభావం సౌభ్రాతృత్వం (దేశ పౌరులందరితో సోదరభావంతో మెలగడం..సంస్థ నిర్మాణం దేశ ఐక్యత, సమగ్రతను బలోపేతం చేయడం.. సంక్షేమం సంక్షేమం సమాజానికి, దేశానికి మేలు చేసే కార్యక్రమాల్లో పాల్గొనడం. సంపద శ్రేయస్సు దేశానికి ఆనందం, సంపదతో కూడిన అన్ని రకాల అభివృద్ధి సమకూరడం కోసం పాటుపడటం. పరిశ్రమ పరిశ్రమ పారిశ్రామిక పురోగతికి సాయపడటం భద్రత భద్రత దేశ రక్షణ కోసం సదా సర్వ సన్నద్ధంగా ఉండటం. అవగాహన జ్ఞానం వాస్తవాలకు సంబంధించి అవగాహన కల్గి ఉండటం, పుకార్లను నమ్మకపోవడం.. సమానత్వం



సమానత్వ ప్రాతిపదికన సమాజ నిర్మాణానికి కృషి చేయడం.. అర్థం : ఆర్థిక పరిజ్ఞానం డబ్బును ఉత్తమంగా వినియోగించే తెలివి/ నేర్పు కల్గి ఉండటం.. విధానం దేశం నిర్మించిన విధానంపై విశ్వాసం కల్గి ఉండటం న్యాయం అందరికీ న్యాయం గురించి కృషి చేయడం.. సహకారం: పరస్పరం కలిసిమెలసి పనిచేయడం.. విధులు ప్రతి ఒక్కరూ తమ విధులను నిజాయతీగా నిర్వర్తించడం.. హక్కులు ప్రతి పౌరుడు తన హక్కులను సక్రమంగా వినియోగించడం, దుర్వినియోగం చేయకపోవడం. వివేకం.. సందర్భానికి తగినట్టు వ్యవహరించే వివేచన, పుస్తకాల్లో చెప్పని జ్ఞానం కలిగి ఉండటం ఇలా.. అశోక చక్రంలోని ఒక్కో ఆకుకు పవిత్రమైన అర్థం ఉంది.ఇవి వ్యక్తి సంపూర్ణ వికాసానికి తోడ్పడతాయి. తద్వారా దేశ పురోగతికి దోహదపడతాయిప్రతి పౌరుడి హక్కుల గురించి, విధుల గురించి స్పష్టత ఇస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే..ఇవి దేశాన్ని,వ్యక్తినీ సమున్నతంగా నిలబెట్టే పదునైన ఆయుధాల లాంటివి.వాటి పరమార్థం తెలుసుకొని జాతి నిర్మాతల, స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చే దిశగా కృషి చేయాలనీ ఈ సందర్భంగా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లింగారపు కుమార్ గౌడ్, కాశిరెడ్డి గూడ గ్రామసర్పంచ్ రామలింగం గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు వెంకటయ్య గౌడ్, భాస్కరెడ్డి,కృష్ణయ్య,యాదయ్య,సతయ్య,నారాయణ,నరసింహులు, అంజయ్య,శేఖర్,అంజయ్య, యాదయ్య,మహిపాల్ రెడ్డి, మలేష్,యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వ వైఫల్యాల వల్లే దేశంలో విధ్వంసం

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ




**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** భారత దేశంలో సంక్షోభానికి, వ్యవస్థల విధ్వంసానికి, నిరుద్యోగ పెరుగుదలకు మోదీ ప్రభుత్వ వైఫల్యాల ప్రధాన కారణం అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ హైదరాబాద్ జిల్లా సిపిఐ సమితి ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా జరిగిన పాదయాత్రలు ముగింపు పాదయాత్ర శుక్రవారం హైదరాబాద్ అంబర్ పెట్ శ్రీరమణ థియేటర్ నుండి అలీ కేఫ్ చౌరస్త వరకు జరిగింది. సిపిఐ శ్రేణులు ఎర్ర జండాలను చేతబూని ప్రజలను కలసి కరపత్రాలను పంచుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఈ.టి.నరసింహ మాట్లాడుతూ, హిట్లర్ ను మించిన ప్రధాని మోదీ దేశాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను ధ్వంసం చేస్తూ, ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ నయా నియంతలా వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశ ప్రజలు నడుము విరిచే ధరల పెరుగుదల, నిరుద్యోగంతో అల్లాడుతుంటే మోదీ మాత్రం సమాజంలో విభజనలు సృష్టించదనికి కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. అధిక పన్నులు వసూలు చేయడం,చౌక చమురును అధిక ధరలకు అమ్ముకుంటూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆర్థిక దోపిడీకి పాల్పడుతుందని తెలిపారు.గత 12 ఏళ్ళ మోదీ ప్రభుత్వం పాలనలో వాగ్దానాలన్నీ విఫలమైనవని, హక్కులు నిరాకరించబడ్డాయని, అణిచివేతలు అంతులేకుండా పెరిగాయని, కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతరేక విధానాల వల్ల ప్రజలు అభద్రతా భావానికి లోనవుతున్నారని అన్నారు. ప్రధాని మోదీ నియంతృత్వ ప్రభుత్వ ప్రజా వ్యతరేక విధానాలను పెద్దఎత్తున ప్రతిఘటించవలసిన అవసరం ఉందని,ఇందుకు రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువత సంఘటితమై భారీ ఎత్తున ఉద్యమాలు చేసి మోదీను గద్దె దించి దేశాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని ఈ.టి.నరసింహ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్,సహాయ కార్యదర్శి కమతం యాదగిరి , తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ,జిల్లా కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్,పడాల నళిని,కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం,షంషుద్దీన్, ఉమర్ ఖాన్, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్,చెట్టు కింది శ్రీనివాస్, గ్యార నరేష్,ఇమ్రాన్ మహమూద్, కాశన్న,పి. కొమురెల్లి బాబు, వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, కళ్యాణ్,కృష్ణ, నదీం,లెనిన్,ఉదయ్,లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# దూసకల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో యూనిఫామ్ దుస్తుల పంపిణీ





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలోని దూసకల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో యూనిఫామ్ బెల్ట్స్ పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ, చిన్నారులు ఈ దుస్తువులను సరిగ్గా వినియోగించుకొని,చక్కగా చదివి భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరాలని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేవతి, ఉపాధ్యాయులు సంతోష్ బాబు, సర్ఫరాజ్ అన్వర్, శ్రీనివాస్,శిరీష, వివోఏలు,కమ్మరి లక్ష్మీ, ఫౌజియా స్కూల్ ఛైర్మన్ శైలేజ మేడిపల్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

### -తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా సాగుతున్న 'తిరంగా' క్యాంపెయిన్లో భాగంగా జాతీయ భావాన్ని చాటేలా భారీ తిరంగా ర్యాలీ శుక్రవారం రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం జగన్మాత సేవలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ మోళ్ళరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం



అత్యంత వైభవంగా జరిగింది.ఈ ర్యాలీలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యతని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో జాతీయ భావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు రవీందర్ రెడ్డి, శర్మ, మధుసూదన్ రెడ్డి,మహేందర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, నరేష్ యాదవ్, మల్లయ్య, రాజేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## నాగోల్ డివిజన్ పరిధిలోని మధురానగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**నాగోల్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శుక్రవారం రోజు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో తో కలిసి నాగోల్ డివిజన్ పరిధిలోని మధురానగర్ నందు పర్యటించడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పక్క కాలనీలు అయిన ఇంద్రపస్తకాలని, ధనలక్ష్మి నగర్ కాలనీ తదితర చుట్టుపక్కల కాలనీలో నుంచి వచ్చే వరదనీరు డ్రైనేజీ నీరు ఇట్టి మధుర



నగర్ దగ్గర ఆగిపోవడం జరుగుతుంది.దీనివల్ల చిన్నపాటి వర్షానికి మోకాళ్ళ లోతు నీళ్లు కాలనీ నందు చేరడం జరుగుతుంది.గతంలో మధురానగర్ కాలనీ అపార్ట్మెంట్ దగ్గర వరదనీరు పోవడానికి చిన్న ఔట్ లేట్ ఏర్పాటు చేయడం జరిగింది.ఇప్పుడు అది సరిపోవడం లేదని తెలిపారు.దానిలో భాగంగా అట్టి అవుట్ లేట్ స్థానంలో పెద్ద అవుట్ లేట్ నిర్మిస్తే రాబోయే రోజుల్లో వరద నీరు సాఫీగా పోతుంది అని సుధీర్ రెడ్డి తెలిపారు.దానికి స్పందించిన జోనల్ కమిషనర్ తప్పకుండా పెద్ద అవుట్ లెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.దానికి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బారసా నాయకులు అనంతుల రాజిరెడ్డి,డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి కాలనీవాసులు పాల్గొన్నారు.

# గెలుపు కాదది బలుపు..

**అది బీఆర్ఎస్ యూనివర్సిటీ..**

**గత ఎన్నికల్లో కూడా ఇలాంటి ఫేక్ సర్వేలు ఎన్నో..**

**వర్తమానంలో ఓటమి తప్పలేదు..**

**సోషల్ మీడియాను వాడుకుంటూ బిజెపి తరహా బీఆర్ఎస్ డ్రామాలు..**

**సర్వేలపై సోషల్ మీడియా వార్ మొదలుపెట్టిన కాంగ్రెస్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
గెలుపు కాదది కేవలం సోషల్ మీడియాను వాడుకునే బీఆర్ఎస్ నాయకుల బలుపు..దేశంలో బిజెపి తరహాలో తెలంగాణలో బీఆర్ఎస్ కు కూడా సోషల్ మీడియా యూనివర్సిటీ ఉంది.దాన్ని వాడుకుంటూ విపరీత ప్రచారాలు చేసుకుంటున్నారు..గతంలో కూడా ఇలా చాలా చేశారు.. ఇలాంటి ఫేక్ సర్వేలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థాయిని తగ్గించలేవు.. అంటూ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా వార్ మొదలుపెట్టారు. పలు సోషల్ మీడియాలలో వివిధ ఛానల్ ద్వారా నిర్వహించిన సర్వేలో గత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు అనుకూలంగా ఓట్లు రావడం పై కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ వార్ కు దిగారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గెలుస్తాడంటూ పలు సర్వేలు చేశారని, తప్పుడు ప్రచారాలు మొదలు పెట్టారని గుర్తు చేశారు.కానీ చివరికి ఏం జరిగిందో అసెంబ్లీ ప్రజలకు తెలుసని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. గతంలో టిఆర్ఎస్ కు చెందిన ఒక సర్వే సంస్థ షాద్ నగర్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గెలుపు ఖాయమని చెప్పిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఆ సర్వేకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టి హల్చల్ చేస్తున్నారు. తమ నేత అంజన్నను జనం మర్చిపోలేదని, వచ్చే ఎన్నికల్లో ఆయనదే గెలుపని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తుంటే,అంత సీన్ లేదని,వచ్చే ఎన్నికల్లో కూడా



వీర్లపల్లి శంకర్ కు ప్రజల దీవెనలు ఉంటాయని ప్రచారం చేస్తున్నారు. దీనితో ఒక విధంగా రెండు వర్గాల మధ్య సోషల్ మీడియా వారు మొదలు కావడం ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశం అయింది.

### వీర్లపల్లి వైపే జనం..

మరోవైపు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పాత జాతీయ రహదారి విస్తరణ, అదే డబ్బునిధులతో డబుల్ బెడ్రూంలు పూర్తి చేయడం, అర్ధాంతరంగా ఆగిపోయిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, గతంలో ఎప్పుడూ లేనంతగా సీఎం సహాయనిధి నియోజకవర్గ ప్రజలకు అందించడం, రహదారులకు పెద్ద ఎత్తున నిధులు తీసుకురావడం, నియోజకవర్గంలో వంతెనల నిర్మాణం వంటి ఎమ్మెల్యే కార్యక్రమాలను తెరమీదకి తెస్తున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, రూ.500 కే సిలిండర్,ఉచిత విద్యుత్ సదుపాయం ఇలాంటి పథకాల ద్వారా చేకూరుతున్న లబ్ధి గురించి వివరిస్తున్నారు. తాజాగా పెన్షన్లను కూడా ప్రభుత్వం అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న సంగతి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా సోషల్ మీడియాలో యాక్టివ్ గా తమ వాణి వినిపించడంతో రాజకీయంగా ఈ అంశం సోషల్ మీడియా ఫాలో అయ్యే వారిలో ఆసక్తిని రేపుతోంది. ప్రతి చోట ఇది చర్చనీయాంశంగా మారింది.

### అన్నీ ఫేక్ సర్వేలే..
### లింగారెడ్డిగూడెం ఉపసర్పంచ్ అశోక్

బీఆర్ఎస్ దేశంలో బిజెపి తరహాలోనే రాష్ట్రంలో సోషల్ మీడియాను వాడుకుంటుందని,ఫేక్ సర్వేలు చేస్తూ ప్రజలందరూ తప్పుతో పట్టించే ప్రయత్నం చేస్తుందని లింగారెడ్డి కూడా ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ అన్నారు. అంజయ్య యాదవ్ అనుకూల సర్వేలపై ఆయన స్పందిస్తూ గత ఎన్నికలకు ముందు కూడా ఇలాంటి సర్వేలు ఎన్నో బయటకు తెచ్చి జనాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని,కానీ చివరగా విజయం సాధించింది తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని ఆయన గుర్తు చేశారు. తెలంగాణకు బీఆర్ఎస్ చేసిన ద్రోహాన్ని ఎవరు మర్చిపోరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరోసారి గెలవడం ఖాయమని, ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు ఘనవిజయాన్ని అందిస్తాయని గుర్తు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించి ఎందరో విద్యార్థులకు కళలను సహకారం చేసిన ఘనత తమ ఎమ్మెల్యే సొంతమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఫేక్ వార్తలను,ఫేక్ సర్వేలను ప్రజలు నమోవొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సర్వేలపై అంత ఉలికిపాటు దేనికి..?

**సోషల్ మీడియా సంస్థలు సర్వేలు చేస్తే మాకేం సంబంధం..**

**అధికారం కోసం అర్రులు చేస్తుంది మీరు. మేం కాదు..**

**బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి "చీపిరి రవి యాదవ్"**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సోషల్ మీడియాలో టిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వస్తున్న కొన్ని సంస్థల సర్వేలకు అధికార కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు ఉలికి పడుతున్నారని వాస్తవాలు జీర్ణించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారంటూ బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చీపిరి రవి యాదవ్ విమర్శలు వ్యక్తం చేశారు. కొన్ని యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ ఇతర సంస్థలు రాష్ట్రంలో జరగబోయే భవిష్యత్ పరిణామాలు ఇతర అంశాలను కులం కుశంగా పరిశీలించి సదరు సంస్థలు కొన్ని ఫలితాలను సోషల్ మీడియాలో విడుదల చేశారని వాటిని మీడియా సంస్థలు స్వీకరించి వార్తలుగా మలిచారని, ఇందులో బిఆర్ఎస్ పార్టీ ప్రమేయం ఎంత మాత్రం లేదని చీపిరి రవి యాదవ్ స్పష్టం చేశారు. వాస్తవాలు చూసి ఆత్మ పరిశీలన చేసుకోవాల్సింది పోయి కూర్చుకోలేక తమపై నిందారోపణలు చేయడం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు భారతీయ జనతా పార్టీ నాయకులకు ఎంత మాత్రం తగదని చీపిరి రవి యాదవ్ హితవు పలికారు. రాష్ట్రంలో అనేక సర్వే సంస్థలు యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్ నిర్వాహకులు ఎంతోమంది ఎన్నో రకాలుగా



నియోజకవర్గాల వారిగా సర్వేలు చేస్తుంటారని వాటిని సోషల్ మీడియాలో పెడుతుంటారని అంతేతప్ప తామేమి సర్వేలు చేయించుకోలేదని బిజెపి నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గుర్తించాలన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎవరు సర్వేలు చేయించుకున్నారు ప్రజలకు మీడియా సంస్థలకు తెలుసని కొత్తగా చెప్పనక్కర్లేదని ప్రజల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీలకు తగ్గుతున్న ఆదరణ చూసి వాటిని కవర్ చేసుకునేందుకు బిఆర్ఎస్ పార్టీని వారు విమర్శిస్తున్నారని స్పష్టం చేశారు. ఎవరిని విమర్శలు చేసిన చివరకు వచ్చే ఎన్నికల్లో "గులాబీ" గుభాలించక తప్పదు, "కమలం" వాడిపోక తప్పదు,"చేయి" విరిగిపోక తప్పదని చీపిరి రవి యాదవ్ జోస్యం చెప్పారు. తెలంగాణలో అధికారం కోసం బిజెపి అర్రులు చాస్తుందని విమర్శలు చేశారు.

# ఫేక్ సర్వేల పేరుతో రాజకీయ డ్రామాలు ఆపాలి..

**ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నాలను తిప్పికొడతారు.**

**షాద్‌నగర్ బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి**

**45 రోజుల్లో నాలుగు సర్వేలు ఎందుకు..?**

**కేటీఆర్, హరీష్ రావు లకు మించిన ప్రజా ఆదరణ మీకుందా..?**

**బిజెపికు ఆదరణ పెరుగుతున్న విషయం మర్చిపోవద్దు..**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వివిధ సర్వేలపై షాద్‌నగర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఫేక్ సర్వేల పేరుతో రాజకీయ డ్రామాలు ఆడుతూ ప్రజలను అయోమయానికి గురిచేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. నమ్మకం లేని వారే ముందస్తు సర్వేల పేరుతో ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తారని విమర్శించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో వెలుగుచూస్తున్న సర్వేలను పరిశీలిస్తే వాటి వెనుక అసలు ఉద్దేశం ఏమిటో స్పష్టమవుతుందని అన్నారు. ఈ సర్వేలను ఎవరు నిర్వహించారు? ఎందుకోసం నిర్వహించారు? వాటికి ప్రామాణికత ఏమిటి? అనే విషయాలను ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సోషల్ మీడియాలో కొన్ని సర్వే ఫలితాలను ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు. సిద్దిపేట,సిరిసిల్ల నియోజకవర్గాలకు సంబంధించి కూడా గతంలో కొన్ని సోషల్ మీడియా వేదికల్లో వెలువడిన సర్వే ఫలితాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అక్కడ మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కూడా ఇబ్బందికరంగా కనిపించే ఫలితాలు కొన్ని సర్వేల్లో వచ్చాయని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారిని మించి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు అనుకూలంగా సర్వే ఫలితాలు వస్తున్నాయని ప్రచారం చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదురయ్యే ఓటమి భయంతోనే షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంపై బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రజలు రాజ్యాంగబద్ధంగా ఎమ్మెల్యే శంకర్‌కు ఐదేళ్ల పాటు ప్రజా సేవ చేసే అవకాశం కల్పించారని విష్ణువర్ధన్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో అధికారంలోకి రాబోతున్నట్లుగా బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

### 45 రోజుల్లో నాలుగు సర్వేలు ఎందుకు?

సోషల్ మీడియాలో వెలుగుచూసిన సర్వే ఫలితాలను పరిశీలిస్తే కేవలం 45 రోజుల వ్యవధిలో నాలుగు సర్వేలు చేయాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి రాజకీయంగా అంజయ్య యాదవ్ వర్గానికి సవాల్‌గా మారుతున్నారనే భయంతోనే వరుస సర్వేలు నిర్వహిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.
రాజకీయాల్లో భయపడే వారే ముందస్తు సర్వేలపై ఆధారపడతారని ప్రజల్లో నిజమైన అభిమానం, ఆదరణ, బలం ఉన్న నాయకులు మాత్రం ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలో తమ సత్తా ఏమిటో నిరూపించుకుంటారని అన్నారు. సర్వేలు చేయించుకోవడం ద్వారా ప్రజల అభిప్రాయాలను మార్చలేరని స్పష్టం చేశారు.
ఇక వివిధ సంస్థల పేర్లతో వెలువడుతున్న సర్వేలను పరిశీలిస్తే ఒక సర్వేలో 70 శాతానికి పైగా అంజయ్య యాదవ్‌కు అనుకూలంగా ఫలితాలు వచ్చాయని ప్రచారం చేసి, కేవలం 15 రోజుల వ్యవధిలోనే అదే స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇతర సంస్థలు వెల్లడించిన సర్వే ఫలితాలు కూడా మొదటి సర్వేకు పూర్తిగా భిన్నంగా ఉండటం చూస్తుంటే ఈ సర్వేల విశ్వసనీయతపై అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. సర్వేల పేరుతో ఇలాంటి గారడీలు చేసి ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నించినా ప్రజలు ఎంతో తెలివైన వారని, సరైన సమయంలో సరైన రీతిలో స్పందిస్తారని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఫేక్ సర్వేల ద్వారా ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయాలని చూస్తే అది సాధ్యం కాదన్నారు.

### బీజేపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

ఫేక్ సర్వేల పేరుతో రాజకీయ డ్రామాలు చేయడం తక్షణమే నిలిపివేయాలని ఆయన సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న సర్వేలను ప్రజలు నమ్మబోరని స్పష్టం చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల్లో గణనీయమైన ఆదరణ ఉందని, రాబోయే రోజుల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలనే ఆలోచన ప్రజల్లో బలపడుతోందని అన్నారు.
ప్రజల అసలు తీర్పు సోషల్ మీడియా సర్వేల్లో కాకుండా ప్రజాక్షేత్రంలోనే తెలుస్తుందని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు సర్వేల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించకుండా అభివృద్ధి,ప్రజా సమస్యలు,ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

# కుల వివక్షత,సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతాం..,

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఎమ్మార్పీఎస్,అలాగే అనుబంధ విభాగాల నూతన గ్రామ కమిటీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడం కొరకై షాద్ నగర్ నియోజకవర్గ సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ ఫరూఖ్ నగర్ మండల ఇంచార్జి నాగ భూషణ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ హాజరై నూతన గ్రామ కమిటీల ఏర్పాటు,నాయకుల కర్తవ్యంపై మాట్లాడడం జరిగింది. గ్రామ కమిటీలు వేసే విషయంలో నాయకులు నిర్లక్ష్యాన్ని విడాలని, వెంటనే గ్రామాలకు వెళ్లి కమిటీలు వేయాలని,అన్ని అనుబంధ సంఘాలను కూడా నిర్మాణం చేయాలని కృష్ణ మాదిగ ఆదేశాల



మేరకు రాజకీయ పార్టీలతో సంబంధం లేని చదువుకున్న యువతరం తోనే కమిటీలు వేయాలని,ఆ కమిటీలు నిలబడే విధంగా, ఉద్యమ ప్రయాణంలో కలిసి నడిచే విధంగా ఉండాలని గుర్తుచేశారు. అనంతరం మండలాల వారీగా జరిగిన పని,జరగాల్సిన పనిమీద సమీక్ష చేసి సెప్టెంబర్ 9 లోపే అన్ని గ్రామ కమిటీలు మండల కమిటీలు పూర్తి కావాలి కాబట్టి సీరియస్ గా పని విభజన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రావుగాళ్ళ బాబు,ఎమ్మెస్పీ మాజీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళనరసింహ,ఎమ్మార్పీఎస్ మాజీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,అన్నెగల్లా ఆనంద్,ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల మాజీ అధ్యక్షులు చిర్ర శ్రీను,కేశంపేట మండల మాజీ అధ్యక్షులు చెన్నగల్ల అశోక్,నందిగామ మండల మాజీ ఇంచార్జ్ బొబ్బిలి పాండు,ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్రోళ్ల సురేష్,ఎం ఏస్ ఎఫ్ తాలూకా నాయకులు మాదాపురం సుదర్శన్,ఎమ్మార్పీఎస్ నాయకులు కళ్లేపల్లి బలరాజ్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు సంగెం శ్రీను,వేణు,రమేష్,జోగు శ్రీశైలం,జోగు నరేష్,జోగు సిద్ధార్థ్,రమేష్,చింటూ,తదితరులు పాల్గొన్నారు

# ఉద్యమకారుల సేవలకు ఘన సత్కారం

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిన సేవలకు ప్రశంస పత్రాలు







తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినటువంటి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సైదులు

**హైదరాబాద్:(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారుల సేవలను గుర్తిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా సత్కరించారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ, ఎల్బీనగర్ ఇన్‌చార్జి బీరెల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కంతం సైదులుకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వారి పాత్రను ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ కొనియాడారు. ఉద్యమం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మరి కొంతమంది ఉద్యమకారులు ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన ఉద్యమకారులకు ప్రశంస పత్రాలను అందజేశారు ప్రశంసా పత్రాలను అందుకున్న వారు నర చంద్రశేఖర్ రెడ్డి, ఈ.అశోక్ కుమార్,కడిమల గోపాల్, బొమ్మకంటి శ్రీనివాస్, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన చింతపట్ల రవీందర్,అనంత కుమార్,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కోసం సాగిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఉద్యమకారుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ బీరెల్లి వెంకట్ రెడ్డి నాయకులు అన్నారు.

# రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై సర్వేల్లో కాంగ్రెస్‌కే జై కొట్టిన ప్రజలు..

**బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో ఎడిటింగ్ పోస్టులను, కల్పితాల ప్రచారం..**

**కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోగురి పురుషోత్తంరెడ్డి**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నిర్వహించిన పలు ప్రజాభిప్రాయ సర్వేల్లో షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మద్దతు ప్రకటిస్తున్నారని పిఎసిఎస్ చైర్మన్ తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి పేర్కొన్నారు . సి-ప్యాక్ 'మూడ్ ఆఫ్ తెలంగాణ' సర్వే లో షాద్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 49.41 శాతం, బీఆర్ఎస్‌కు 33.51 శాతం, బీజేపీకి 10.57 శాతం, ఇతరులకు 2.67 శాతం ఓటు మద్దతు లభించినట్లు వెల్లడైంది. ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆధిక్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా
ఎస్ ఏఎస్ మూడ్ ఆఫ్ తెలంగాణ' సర్వే లో కూడా షాద్ నగర్‌లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభిస్తుందని వెల్లడైనట్లు తెలిపారు. హెచ్ ఎమ్ ఆర్ పబ్లిక్ పల్స్ సర్వే2026 లో కూడా షాద్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు కొనసాగుతోందని పేర్కొన్నారు. పేరుమోసిన సంస్థలు నిర్వహించిన ఎన్నికల సర్వేల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు వస్తుండటాన్ని జీర్ణించుకోలేక కొందరు సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రీ-పోల్ పేరుతో సర్వేలు సృష్టించి, వాటిని పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తూ లైకులు కొట్టించుకొని, అదే నిజమైన సర్వే అంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం పూర్తిగా అవివేకమని విమర్శించారు.
అంతేకాకుండా, తమకు అనుకూలంగా కనిపించేలా బీఆర్ఎస్ అనుకూల ఎడిటింగ్ పోస్టులను తయారు చేసి, ప్రజలు ఇంకా తమవైపే ఉన్నారు. అంటూ ప్రచారం చేసుకోవడం కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. సోషల్ మీడియాలో లైకులు,ఎడిటెడ్ పోస్టులు ఎన్నికల సర్వేలకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా, మద్దతుగా వ్యవహరిస్తున్న శివరెడ్డి నిర్వహించే సిగ్నల్ టీవీ సైతం షాద్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయం సాధించబోతుందని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని వారు గుర్తుచేశారు. ప్రజల నాడిని తెలుసుకోవాలంటే సోషల్ మీడియా ప్రీ-పోల్స్, ఎడిటింగ్ పోస్టులు కాదు.. ప్రజల్లోకి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేలు షాద్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి..




# ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జోనల్ కమిషనర్ ను పలు సమస్యలపై ఆరా

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
హయత్ నగర్ కుమ్మరికుంట చెరువు మీద రోడ్డు మీద ప్రయాణం చేయడానికి ప్రజలు ప్రతినిత్యం నరకాయతన పడుతున్న నేపథ్యంలో అట్టి విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శుక్రవారం రోజు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ని అట్టి ప్రదేశానికి తీసుకువచ్చి అట్టి రోడ్డును వారికి చూపించడం జరిగింది. ప్రతినిత్యం ఇట్టి రోడ్డుమీద వందలాది వాహనాలు వెళుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున నూతన రోడ్డు నిర్మాణ పనులు మంజూరు చేయాలనీ కోరడమైనది. అలాగే కట్ట వెడల్పు చేయాలనీ కోరడమైనది. వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ కట్ట వెడల్పు నూతన రోడ్డు నిర్మాణ కోసం యుద్ధప్రతిపదికన నిధులు మంజూరు చేసి నిర్మాణం చెప్పాడుతామని హామీ ఇచ్చారు.



# మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

**కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్, ఐమ్యాక్స్ సర్కిల్ ఎదురుగా, హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ (అంబేద్కర్ విగ్రహం సమీపంలో) మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్,మంత్రులు వాకిటి శ్రీహరి,పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్,ఆర్ కృష్ణయ్య,సురేష్ షెట్కర్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, దానం నాగేందర్,నవీన్ యాదవ్, మందుల సామేల్ ,మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్,ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !




**ఆగస్టు 14(ప్రజావినికిడి):**

స్వాతంత్య్రం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్య్ర పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్య్రపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్య్రం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్య్రం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# మహాత్మా మన్నించు..!

**మొగలిగిద్ద సర్పంచ్,ఉప సర్పంచ్ భర్త మరికొందరి నిర్వాకం..**
**ఎంజిఎన్ఆర్ఈజీఎస్ నిధుల చెక్ కోసం.. రూ.10 లక్షల లంచం డిమాండ్..**
**రూ.2.88 కోట్లకు ఇదివరకే 4 లక్షలు లంచం తీసుకున్న వైనం..**
**మరో 43 లక్షల చెక్కు విడుదల కోసం 6 లక్షలు డిమాండ్..**
**కలెక్టర్ చూశారా ఈ అవినీతి**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మంజూరు చేసిన సీసీ రోడ్లకే లంచం డిమాండ్..**
**గత్యంతరం లేని పరిస్థితుల్లో నాలుగు లక్షల సమర్పించుకున్న కాంట్రాక్టర్..**




**షాద్ నగర్, (ప్రజావినికిడి):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజి ఎన్ఆర్ఈజీఎస్) అనేది గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ప్రతిష్టాత్మక పథకం.ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధిని కల్పించడం లక్ష్యం..అయితే ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మొగలిగిద్ద గ్రామానికి విచ్చేసి ఐదు కోట్ల రూపాయల విలువైన సిసి రోడ్లను బహిరంగ సభలో మంజూరు చేశారు.ఈ పథకం కింద పనులు చేపట్టడానికి కొత్తూరు మండలం జహంగీర్ పీర్ దర్గాకు చెందిన ఖాజాపాషా ముందుకు వచ్చారు. ఇంతవరకు బాగానే ఉంది కష్టపడి రోడ్లు వేసి ఎంతోకాలంగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.ఇప్పుడు మొదలైంది అసలైన ఆట. ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ బుగ్గ కృష్ణ, ఉపసర్పంచ్ లక్ష్మీ భర్త రాము,మరో వార్డు సభ్యుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ ముగ్గురు సదరు కాంట్రాక్టర్ పై ఒత్తిడి తెచ్చి లంచం ఇస్తే తప్ప చెక్కులు ఇవ్వబోమని భీష్మించుకొని కూర్చున్నారు. పనిచేసి ఎంతోకాలంగా లక్షలు వెచ్చించి కోట్లాది రూపాయలు నిలుపుకునే కంటే వారు అడిగిన దానిలో కొంత ఇచ్చి మొదటి విడత చెక్కులను మంజూరు చేయించుకున్నారు.దీనికోసం సదర్ వార్డు సభ్యుడు అకౌంట్లోకి 4 లక్షల రూపాయలను ఖాజాపాషా జమ చేశారు. ఇంకా మిగతా డబ్బు విడుదల కోసం చెక్కులు అడిగితే మరో ఆరు లక్షలు చెల్లించనిదే చెక్కులు ఇవ్వబోమని సర్పంచ్ కృష్ణ వాదించినట్లు బాధితుడు ఖాజా పాషా ఫరూక్ నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీకాంత్ కు స్వయంగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ అవినీతి బయటికి పొక్కింది.

## అసలేం జరిగిందంటే..

గత సంవత్సరం క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగలిగిద్ద గ్రామ పాఠశాల శత వసంత కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా ఐదు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు ఏర్పాటు చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరు చేశారు.అయితే ఈ పనులు చేపట్టేందుకు కొత్తూరు మండలం దర్గా నివాసి ఖాజా పాషా ముందుకు వచ్చారు. దాదాపు ఆయన నాలుగు కోట్ల రూపాయల విలువైన సిసి రోడ్లను గ్రామంలో నిర్మించారు. వీటికి సంబంధించి మొత్తం నిధులపై 30% లంచం అడిగారు. చివరకు పది లక్షలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ పెట్టారు. ఇందులో భాగంగానే ముందుగా నాలుగు లక్షల రూపాయలు వారి అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేశారు.

## మొదటి విడతగా..

నాలుగు కోట్ల రూపాయల విలువైన సిసి రోడ్ల పనులు చేపట్టిన ఖాజాపాషకు నిధులు ప్రభుత్వం నుండి రాబట్టుకునేందుకు ఇబ్బందికర పరిస్తితులు కల్పించారు. మొదటి విడతగా రెండు కోట్ల 88 లక్షల పైచిలుకు రూపాయలకు ప్రభుత్వం చెక్కులను మంజూరు చేసింది.అయితే ఈ చెక్కులు సదరు కాంట్రాక్టర్ కు చెల్లించడానికి మొగిలిగిద్ద గ్రామ సర్పంచ్ బుగ్గ కృష్ణ, ఉపసర్పంచ్ లక్ష్మి భర్త రాము,వార్డు సభ్యుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ ముగ్గురు కలిసి 10 లక్షలు చెక్కు విడుదల కోసం డిమాండ్ చేశారు. ఈ తతంగంలో కాజా పాషా తన డబ్బులు రాబట్టుకునేందుకు చెక్కుల కోసం అనేక ప్రయత్నాలు చేశారు చివరకు గత్యంతరం లేక 4 లక్షల రూపాయలు సర్పంచ్ కృష్ణ సూచించిన విధంగా గ్రామ అవార్డు సభ్యుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ అకౌంట్ కు డబ్బులు జమ చేశారు.దీంతో రెండు కోట్ల 88 లక్షల రూపాయల చెక్కులు ఆయనకు అందజేయడం జరిగింది.

## రెండో విడతగా..

ఇక మిగతా పనులు చేపట్టిన తర్వాత రెండో విడతగా 43 లక్షల రూపాయలు మరోసారి విడుదల అయ్యాయి. అయితే మిగతా 6 లక్షల డబ్బులు చెల్లిస్తేనే 43 లక్షల రూపాయలకు సంబంధించిన చెక్కులు ఇస్తానని సర్పంచ్ కృష్ణ ఉపసర్పంచ్ భర్త రాము వార్డు సభ్యుడు రెహమాన్ మొండికేశారు. శుక్రవారం చెక్కులు ఇస్తామని పిలిపించిన వారు తమకు డబ్బులు అందలేదని వారిని గంటల తరబడి గ్రామపంచాయతీలో కూర్చోబెట్టారు. చెక్కులు సిద్ధం చేసిన సెక్రటరీ సర్పంచ్ కు ఫోన్ చేయగా వారు స్పందించలేదు. అలా చేయకూడదని కార్యదర్శి కూడా వారికి చెప్పగా అవినీ పట్టించుకోకుండా వారు చెక్కులు ఇవ్వడానికి ససేమీరా ఒప్పుకోలేదు. దీంతో విసిగి వేసారిన కాంట్రాక్టర్ ఖాజా పాషా స్థానిక ఎంపీడీవో శ్రీకాంత్ కు కలిసి గ్రామ సర్పంచ్ కృష్ణ ఉపసర్పంచ్ భర్త రాము, వార్డు సభ్యుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటి ప్రతులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి అదేవిధంగా డిపిఓ కు అందజేస్తున్నట్టు బాధితుడు వివరించారు. ఇదే అంశమై గతంలో బాధితులు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకు వెళ్ళగా ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లో ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి పద్ధతులు మార్చుకోవాలని వెంటనే వారికి చెక్కులు వచ్చే విధంగా చొరవ చూపాలని చెప్పగా,గ్రామ సర్పంచ్ తదితర వ్యక్తులు దీనికి ఒప్పుకోకపోవడంతో ఈ కథ బయటికి వెలుగు చూసింది.

### కలెక్టర్ జర చూడండి..

మొగిలిగిద్ద గ్రామంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసిన సిసి రోడ్ల వ్యవహారంలో స్థానిక సర్పంచ్ తదితరులు డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారం పై కలెక్టర్ చొరవ తీసుకోవాలని దీనిపై సమగ్ర విచారణ జరిపి సర్పంచ్ అదే విధంగా అతను సహకరించిన మిగతా వారిపై సస్పెన్షన్ వేటు వేయాలని ఇతర చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికే నాలుగు లక్షల రూపాయలు లంచం తీసుకున్న సదరు వ్యక్తులు మరో ఆరు లక్షల కోసం ఇబ్బందులు సృష్టించి ఎలాంటి నిజాయితీ లేకుండా వ్యవహరించిన తీరుపై కలెక్టర్ స్వయంగా స్పందించాలని బాధితులు తదితరులు వేడుకుంటున్నారు.ప్రభుత్వ లక్ష్యం దెబ్బతినే విధంగా ప్రభుత్వ పనులు చేపట్టడానికి ఎవరు ముందుకు వస్తారని బాధితులు వాపోతున్నారు. ప్రతి ఒక్కరు ఇలా డబ్బుల కోసం కాంట్రాక్టర్లను వేధిస్తే ప్రభుత్వ పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నిస్తున్నారు.

# ఓ కుటుంబ కథా చిత్రమ్...
## విశ్వనాథ్ అండ్ సన్స్

కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా?




సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్థం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# అతీంద్రియ శక్తుల
# హార్రర్ స్టోరీ అగథ

ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగథ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగథ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగథ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగథకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగథ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగథ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగథ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగథ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే




హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.



# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది
## నటుడు యశ్ ప్రశంసలు



సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి'
## గా విక్టరీ వెంకటేశ్.. పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌తో అంచనాలు డబుల్!




విక్టరీ వెంకటేశ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదవ సినిమాపై నెలకొన్న అంచనాలను మరింత పెంచుతూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులకు కానుకగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌లో వెంకటేశ్ పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. కౌంటర్ టెర్రరిజం, బందీలను విడిపించడంలో నిపుణుడైన సైనికాధికారిగా ఆయన పాత్ర ఉండబోతోందని ఫస్ట్ లుక్ స్పష్టం చేస్తోంది. 1986లో 'కలియుగ పాండవులు' చిత్రంతో అరంగేట్రం చేసిన వెంకటేశ్, సినీ పరిశ్రమలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంలో ఈ పోస్టర్‌ను విడుదల చేయడం విశేషం. ఇప్పటికే ఫ్2, ఫ్3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు.. వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబోలో ఇది ఐదో సినిమా కావడంతో ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నందమూరి కల్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటం అదనపు ఆకర్షణ. వీరి సరసన హీరోయిన్లుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, అనుకున్న సమయానికే చిత్రాన్ని పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తోంది. హిట్ కాంబినేషన్, భారీ తారాగణం, పండుగ సీజన్ విడుదల వంటి అంశాలతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613